# రక్తం కార్చే దయ్యం

"రక్షించాలి, పంతులుగారూ!".... "చెప్పండి, మాస్టారూ!"... "మాపెంకుటిల్లండి. రోజూ రాత్రివేళ నడికప్పునుంచి సావిట్లోకి రక్తం పడుతూందండి."

"హూఁ."... "దయ్యమేమో నని అనుమానం. అనుమానమేంటి, ఖాయమే నండి. ఖాళీ చేద్దామంటే కొంపలేవ్వు." ... "ఏం చేశారు?".... "భూత వైద్యుల్ని - అదే - నేన్ సాయబు గార్నీ, సీతయ్యగార్నీ, స్వస్థత ప్రార్థనలు చేసే లివింగ్‌స్టన్ గార్నీ పిలిపించామండీ. వాళ్ళు చెయ్యమన్న వన్నీ చేశాం. చెయ్యాలనుకున్న వన్నీ వాళ్ళు చేశారు. ఫలితం ఏ మాత్రమూ లేదండీ."

"రక్తం ధారగా పడుతూందా, చుక్కలుగానా?"

"చుక్కలే." ... "ఏవేళప్పుడు పడుతున్నాయి?"... "చెప్పలేక పోతున్నాం. ఏమయినా అర్ధరాత్రి పన్నెండూ రెండు గంటల మధ్యేనండి."

"చుక్కలు పడుతూండగా మీరెప్పుడయినా చూశారా?"

"చూడలేదండి. చూడాలని చాలాసార్లు మేలుకుని కూర్చున్నాం. కూర్చున్నంత సేపూ పడలేదు. పడుకోగానే పడ్డాయండి. రాత్రంతా మేలుకుని కూర్చున్న రోజున అసలు పడలేదు."

"శబ్దం వినిపిస్తుందా?"... "ఏమీ వినిపించదు." ... "బయటినుంచి చూశారా?"... "చూశామండి ఏమీ లేదు.".. "మీరు పిల్లుల్ని పెంచుతున్నారా?"..."లేదండి. పిల్లులంటే మా ఆవిడకి ఒళ్లుమంట"

"మీ కెవరైనా విరోధులున్నారా?"..."ఉన్నారా అంటే ... ఉంటే ...ఉండొచ్చండి. ఉన్నారండి" "ఏవరు? ఏ రకమైన విరోధం?" ... "నేను పూర్వం అద్దెకున్న ఇంటి యజమానండి. వాళ్ళ పిల్లి ఒకసారి మా ఇంట్లో కొచ్చి పాలు పారబోస్తే, మా ఆవిడ,'వెధవ పిల్లి అన్నది. ఠఁయ్‌న ఇంటాయనొచ్చేసి, 'అంటే నేనూ వెధవననేగా?' అని అందుకున్నాడు. మా ఆవిడ రెచ్చిపోయి ఆ రాత్రి ఆ పిల్లి ముక్కుకి అమృతాంజనం పూసింది. ఇహ ఆయన శివమెత్తి పోయాడు. మమ్మల్ని అంతు చూడకపోతే తను మగాణ్నే కానని శపథం చేసేశాడు. పొద్దున్నే నేను ఈ ఇంట్లోకి మారాను."

"ఇది జరిగి ఎంత కాలమైంది?"... "రెండు వారాలు ." ... "ఆయన దైవ భక్తుడా? మంత్రోపాసకుడా?" ... "భక్తీ లేదు, పిండాకూడూ లేదు. కానీ ఎవడ్నో ఆశ్రయించాడనుకుంటున్నాం. మెడలో రుద్రాక్షమాలలతో గడ్డాలూ మీసాలూ పెంచిన వాడొకడు రోజుకోసారి మా కొత్తింటి గుమ్మంలో కొచ్చి తిరిగి పోతున్నట్టు గమనించాం."

"అట్లాంటప్పుడు నే నొచ్చి ఏం చెయ్యగల్ను? నేను క్షుద్రమంత్రోపాసకుణ్ణి కాను. ఏదో గాయత్రి చేసుకుని తృప్తి పడేవాణ్ణే ప్రతి విషయాన్ని దయ్యాలతో ముడి పెట్టడం నాకు చిరాకు కూడా. నాకూ, మీ పాత ఇంటాయనకూ లేనిపోని తగాదా ఎందుకు?"

"అహఁహఁ అట్లా అనకండి. ఆ గాయత్రే మీకు ఏదో మార్గం చూపిస్తూంటుందని అందరూ అనుకుంటూంటారు. బాబ్బాబూ, మీ రాదుకోకపోతే లాభం లేదు. మేమందరం హడిలి ఛస్తున్నా. తుమ్మొచ్చినా దగ్గొచ్చినా ఆ దయ్యమే కారణమని భయంకరంగా వణికి పోతున్నాం మీరోసారి రాక తప్పదు. మీరు కోరినంత ఇస్తాను."

'' నా మంత్రాలు డబ్బుకు పనిచేసేవి కావు మనిషికి మనిషి సహాయమనేదే నా తాత తండ్రులు నేర్పింది. రాత్రికి వస్తాన్లెండి ''

★ ★ ★

'' మాస్టారూ, పన్నెండయింది'' ''ఇదిగో లైటార్పేశాను ఇక్కడే నా విభూతి బుర్రతో కూర్చున్నాను. మీరంతా బయటుండండి పనవ్వగానే తలుపు తీసి పిలుస్తాను ''

★ ★ ★

'' మాస్టారూ, నిద్ర పోతున్నారా? లేవండి నా మీద రక్తం పడింది.''..'' చీకట్లో నిచ్చెనెక్కి కాగితాన్ని మిరాయి పొట్లాం చేసి దాంతో నా విభూతిని అక్కడ పైకప్పులో వూదాను దయ్యం టక్కున కింద పడింది. చూస్తారా? ఇదుగో ఇటు.. ఇటు . ఈ మూల...''

'' ఆఁ గబ్బిలమా! మరి రక్తమో?''

'' ఎలికదో పిచ్చుకదో అయ్యుంటుంది. పైకప్పెక్కి పెంకుల్లో వెతకండి. మరి నా విభూతి, అదే గమాక్సిన్ ఖర్చు పావలా రేప్పొద్దున సాంబయ్య కొట్లో అప్పు తీర్చెయ్యటం మరిచిపోకండి వస్తాను.''

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 28-12-83)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

# కథ చెప్పు పిల్లాడా...

''మాంచి కథేదయినా చెప్పరూ... పత్రిక్కి రాయాలి'' - భర్త యోగారావుకు వక్కపొడి అందిస్తూ అంది సుందరి.

మంచం మీద పడుకొని వీక్లీ చదువుకుంటున్న యోగారావు, పుస్తకంలోంచి చూసి, '' కతా!... నేనేం చెప్పగల్ను !.. యు.డి.సి.లు కథలు రాయరు ఆఫీసు నోటులు రాస్తారు. ''

సుందరి, పెద్దలైటు ఆర్పేసి, ఆకుపచ్చలైటు వేసింది పిల్లలు మద్యగదిలో పడుకొనున్నారు. కనక గది తలుపులు ఓరవాకిలిగా వేసి, తమలపాకుల చిలకల్తో వచ్చి భర్తపక్కన మంచమ్మీద కూర్చుంది. చిలకలందిస్తూ అంది '' రాసేది నేను. మీరు చెప్పండి చాలు! ''

'' కథలూరావు, నాకు కాకరకాయలూ రావు. నిద్దరొస్తోంది పడుకోనీ!'' పుస్తకమూసేస్తూ అన్నాడు యోగారావు. . సుందరి, తనుకూడా రెండు చిలకలు నోట్లో పెట్టుకుంటూ భర్త పక్కన పడుకొంది. ''భర్తని ఏదో ఒకటి చెప్పండి ప్లీజ్!''

'' నన్నొదిలెయ్ అమ్మతల్లీ!''. '' వొదల్ను!. అరిగిపోతారేంటి పెద్ద! '' అంటూ మూతిని మూడువంకర్లు తిప్పి గునుస్తూ అంది సుందరి. '' ఏదో ఒక కథ చెప్పు పిల్లాడా మంచి తాయిలం పెడతాగా!''

యోగారావు చిరాగ్గా లేచి కూర్చున్నాడు అన్నాడు ''సరే , విను! అనగనగా ఓ ఎర్ర పిల్లుంది